సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం : 31 : మార్చి : 2023



క్రికెట్ పోటీలు ప్రారంభం

మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో



గృహోపకరణాలు పంపిణీ

సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో వై.రామవరం, చింతూరు మండలాల్లో సివిక్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. 8లో



విద్యార్థిని అనుమానాస్పద మృతి

స్కూలుకు బయల్దేరిన విద్యార్థిని అనుమానాస్పద రీతిలో మరణించడం సంచలనం రేపింది. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (శుక్ర) 6-10 సహర్ (శని) 4-37

రంపచోడవరం :
ఇఫ్తార్ (శుక్ర) 6-25 సహర్ (శని) 4-39

వావ్.. వైజాగ్.!

విశాఖలో మూడు రోజుల నుంచి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జీ 20 సదస్సు ముగింపు దశకు చేరుకుంది. మూడో రోజున పట్టణ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ సౌకర్యంపై భాగస్వామ్య దేశాలు వ్యూహ రచన చేశాయి. సదస్సు అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో విదేశీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్, కాపులుప్పాడ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, స్మాడా సిస్టమ్‌లను సందర్శించారు. నగర అందాలకు జీ 20 దేశాల ప్రతినిధులు ముగ్ధులై.. వావ్ వైజాగ్ అని కితాబిచ్చారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) సదస్సు గురువారం ముగియగా.. ఆఖరి రోజు శుక్రవారం దేశంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లతో సభ్యదేశాల ప్రతినిధులు సమావేశం కానున్నారు



ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు వద్ద జీ 20 ప్రతినిధులు

- క్షేత్ర పర్యటనలో జీ 20 దేశ ప్రతినిధుల కితాబు
- పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై ప్రశంసలు
- నగర అందాలకు ముగ్ధులైన విదేశీయులు

సాక్షి, విశాఖపట్నం : ఆస్ట్రేలియా, బ్రెజిల్ అధ్యక్షతన విశాఖ వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) రెండో దశ సదస్సు ముగిసింది. స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయాలనే అంశంపై సభ్యదేశాల ప్రతినిధులు కూలంకషంగా చర్చించారు. నగరాల అభివృద్ధి కోసం నిధుల సమీకరణకు అవలంబించాల్సిన విధానాలపై రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఇప్పటికే పలు దేశాల్లోని నగరాల్లో అనుసరిస్తున్న వ్యూహాలను ఆయా దేశాల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మూడు రోజుల పాటు దాదాపు 8 భిన్నమైన సెషన్లు నిర్వహించారు. నగరాభివృద్ధి, పట్టణాభివృద్ధిలో భాగంగా ఎదురవుతున్న సవాళ్లను ఎలా అధిగమించాలన్న అంశాలపై జీ 20 దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు.

విశాఖ.. ఓ అద్భుతం...

మూడో రోజు సెషన్ ముగిసిన అనంతరం.. జీ 20 దేశాల ప్రతినిధులు నగరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను పరిశీలించారు. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌తో పాటు.. దేశంలోనే తొలి ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టుగా రికార్డులకెక్కిన ముడసర్లోవ రిజర్వాయర్‌లోని ప్రాజెక్టును సందర్శించారు. అదేవిధంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వీసీఐసీడీపీ)లో భాగంగా మాధవధారలో స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం పనితీరుని పరిశీలించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం కోసం శ్రమిస్తున్నారంటూ అభినందించారు. దీంతో పాటు పెదవాల్తేరులోని మినీ సూయిజ్ ఫామ్-3 (ఎంఎస్ఎఫ్)లో ఉన్న ఎలక్ట్రానిక్ వెహికల్స్‌ను ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు నగర అభివృద్ధికి చిహ్నంగా ఉన్నాయని, ప్రజలకు అందించాల్సిన మౌలిక వసతులతో పాటు, ప్రజారోగ్యంపై దృష్టి సారిస్తూ వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు అభినందించారు. నగర సుందరీకరణ, సాగరతీరంలో అందాలు, వాల్‌పెయింటింగ్స్ చూసి ప్రతినిధులు ముగ్ధులయ్యారు. విశాఖ అందాలకు నెలవంటూ ప్రశంసలు కురిపించారు.

నేడు విశాఖ నుంచి తిరుగుపయనం

మూడు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన జీ 20 సదస్సులో పాల్గొన్న సభ్యదేశాలు, ఆతిథ్య దేశాల ప్రతినిధులు శుక్రవారం విశాఖ నుంచి తిరుగు పయనం కానున్నారు. శుక్రవారం ఉదయం దేశంలో ఎంపిక చేసిన వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లతో సభ్యదేశాల ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెజిలియన్స్ ప్రాజెక్టుల పనితీరు, వాటి ద్వారా ప్రజలకు, నగరాలు పట్టణాలకు కలుగుతున్న ఉపయోగాలపై కమిషనర్లు వివరించనున్నారు. ఈ సదస్సులో పలు యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు, ఎంపిక చేసిన విద్యార్థులు కూడా హాజరుకానున్నారు. అనంతరం విదేశీ ప్రతినిధులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించనున్నారు. విమానాశ్రయంలో వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. స్వాగతించినప్పుడు ఏ విధంగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారో వీడ్కోలు కూడా అదే రీతిలో ప్రతినిధులకు చిరకాలం గుర్తుండిపోయేలా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాట్లు చేశారు.

సుందరం..సుమధురం

- వైభవంగా శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి కల్యాణం
- రామనామస్మరణతో మార్మోగిన శ్రీరామగిరి
- వేల సంఖ్యలో కల్యాణానికి తరలివచ్చిన భక్తజనులు



మాంగల్యాన్ని చూపుతున్న అర్చకుడు



కల్యాణం క్రతువు జరిపిస్తున్న అర్చకుడు

వీఆర్‌పురం: ఏజెన్సీ భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారి కల్యాణం అశేష భక్తుల రామనామస్మరణ మధ్య అంగరంగ వైభవంగా గురువారం జరిగింది. పుణ్య గోదావరి,పవిత్ర శబరి నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో మాతంగ మహర్షి నిర్మించిన ఆలయంలో నిర్వహించిన ఈ ఉత్సవాన్ని భక్తులు తనివితీరా వీక్షించి భక్తి పారవశ్యంతో ఉప్పొంగిపోయారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు ఈఏడాది అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు కల్యాణ వేడుకలో భాగంగా కొండమీద ఆలయంలో బుధవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. గురువారం వేకువ జామునుంచి కల్యాణ ఘట్టాలను క్రమ పద్ధతిలో చేపట్టారు. బాజాభజంత్రీలతో పుణ్య నదీతీర్థాన్ని స్వామివారికి సమర్పించిన పిదప అర్చకులు కల్యాణ పనుల్లో నిమగ్నమయ్యారు. సీతారాములను ఆలయంలో పెళ్లి కుమార్తె, పెళ్లికుమారులను చేశారు. ముందుగా గర్భగుడిలోని మూలవిరాట్‌లకు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేసి దేవరాజ వాహనంపై కొండ దిగువన ఉన్న కల్యాణ మండపానికి ఊరేగింపుగా తోడ్కొని వచ్చి, వేదికపై అధిష్ఠింపజేశారు.అక్కడ ముందుగా విష్వక్సేన పూజ ,పుణ్యాహవచనం,షోడశోపచార పూజలను వేదపండితులు నిర్వహించారు. తదనంతరం పూర్ణాహుతిని తదుపరి శాంతి కల్యాణాన్ని జరిపారు. సంకల్పం, యజ్ఞోపవీతం,జీలకర్ర బెల్లం ,మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

స్వామివారి కల్యాణానికి దేవదాయశాఖ అధికారులు, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబుతో పాటు పలువురు పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సీఐ గజేంద్ర,ఆలయ కమిటీ చైర్మన్ రేవు బాలరాజు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు చిక్కాల బాలు,సచివాలయ కన్వీనర్ల మండల ఇంచార్జ్ బొడ్డు సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి,ఎండోమెంట్ అసిస్టెంట్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు భేష్

కల్యాణాన్ని వీక్షించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎటపాక సీఐ గజేంద్ర ఆధ్వర్యంలో వీఆర్ పురం ఎస్ఐ టి.దుర్గాప్రసాద్ కూనవరం ఎస్ఐ బి.వెంకటేష్ ,ఏఎస్ఐ అల్లు రాధాకృష్ణ,స్పెషల్ పార్టీ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ఏడాది గోదావరి నదిపై భక్తుల రాకపోకలకు ప్రత్యేకంగా లాంచీల ఏర్పాటు చేయడంతో గోదావరి అవలి వైపున ఉన్న వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

'జటాయువు'ను దర్శించుకున్న భక్తులు

ఎటపాక: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా వందలాది మంది భక్తులు ఎటపాక,ఉష్ణగుండాలను సందర్శించారు. భద్రాద్రిలో జరిగిన శ్రీసీతారాముల తిరుకల్యాణాన్ని తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఉష్ణగుండాలను సందర్శించారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి వేడినీటిని బాటిళ్లలో తీసుకుని వెనుదిరిగారు. ఉష్ణగుండాలకు ఉన్న ప్రాశస్త్యాన్ని తెలుసుకుని భక్తులు పరవశించారు. ఎటపాకలోని జటాయువు మండపాన్ని వందలాది భక్తులు దర్శించుకున్నారు. మండపంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపారు.ఎటపాక వచ్చిన భక్తులకు పలువురు వ్యాపారులు చల్లని మజ్జిగ, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు.



ఉష్ణగుండాలకు వెళుతున్న భక్తులు

దివ్యాంగుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 13వ తేదీలోగా అందజేయాలని విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 51 సంవత్సరాలు దాటి ఉండరాదని తెలిపారు. అంధులకు (9), బధిరులకు (8), శారీరక వైకల్యంగల వారికి (7) కేటాయించారు. ఈ పోస్టులకు కనీస అర్హతలు తెలియజేసే పూర్తి నోటిఫికేషన్, పోస్టుల వారీగా వివరాలు, సూచనలు, దరఖాస్తు ఫారాలను http//visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల తనిఖీ



సింగిల్ విండో క్యాంప్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జమల్ బాషా

మారేడుమిల్లి: మండలంలోని పెద గెద్దాడ, మారేడుమిల్లి, బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమల్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుర్తేడు పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతల బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేయడం , తప్పులు సరిచేయడం కోసం సింగిల్ విండో క్యాంప్ ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మారేడుమిల్లిలో బర్త్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆయన వెంట అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి అనూష తదితరులున్నారు.

రేపటి నుంచి కేజీహెచ్ రోగులకు పౌష్టికాహారం

- పెంచిన డైట్ చార్జీలు అమలు

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్‌లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందించనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డైట్ చార్జీలను గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు చేసింది. గర్భిణులకు కూడా ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం ఒక్కొక్కరికీ రూ.36 చెల్లిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇవే డైట్ చార్జీలు అమలవుతున్నాయి. రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చార్జీలకు రూ.80కు పెంచింది. డ్యూటీ డాక్టర్ల కోసం రూ.80 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం రూ.100కు పెంచారు. గర్భిణులకు కూడా రూ.100తో భోజనం అందించనున్నారు. పెంచిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. కాగా.. కేజీహెచ్‌లో 1200 మంది రోగులు, 56 మంది డ్యూటీ వైద్యులకు రోజూ అల్పాహారం, భోజనం సరఫరా చేస్తున్నారు.

సికింద్రాబాద్-అగర్తల మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్-అగర్తల మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. సికింద్రాబాద్-అగర్తలా (07018) వన్ వే స్పెషల్ ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మంగళవారం రాత్రి 11.15 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నడికుడి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు. విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, డంకుని, బర్ధమాన్, రాంపూర్‌హట్, మాల్దా టౌన్, కిషన్ గంజ్, న్యూ జల్పాయ్‌గురి, జల్పాయ్‌గురి రోడ్, న్యూ కూచ్ బిహార్, న్యూ అలిపుర్‌దార్, న్యూ బొంగయ్‌గావ్, గోల్‌పర, గువాహటి, జాగి రోడ్, హోజయ్, లండింగ్, న్యూ హఫ్లాంగ్, బాదర్‌పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్, అంబాసా స్టేషన్లలో ఆగుతుంది.

ముగిసిన పీఏసీ సభ్యుల పర్యటన

తాటిచెట్లపాలెం(విశాఖ):వాల్తేరు డివిజన్‌లో రైల్వేప్రయాణికుల సదుపాయాల కమిటీ (పీఏసీ)సభ్యుల పర్యటన గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతిసమావేశమయ్యారు. పర్యటనలో గుర్తించిన వివరాలపైమాట్లాడారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే మహరాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి, పీఏసీ కమిటీ సభ్యులు దిలీప్‌కుమార్ మల్లిక్, అభిజిత్‌దాస్, నిర్మలకిషోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, డాక్టర్ మంజుల, పరశురాం మహతో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మార్చి 26 నుంచి వాల్తేర్ డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో పర్యటించిన విషయం తెలిసిందే.

గిరి మహిళకు వన్'ధనం'

దళారుల దబాయింపులు తప్పాయి.. వారి దోపిడీకి తెరపడింది.. కష్టానికి తగిన ఫలితం ముడుతోంది.. గిరి మహిళల ఆర్థిక వికాసానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తోంది.. పాడేరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన వన్‌ధన్ కేంద్రాలను డ్వాక్రా సభ్యులు విజయవంతంగా నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెలుగు శాఖ ద్వారా బ్యాంకులు రుణాలు అందిస్తుండటంతో సద్వినియోగం చేసుకుంటూ కలలు సాకారం చేసుకుంటున్నారు.

- పాడేరు డివిజన్‌లో 98 వీడీకేలు
- విజయవంతంగా నిర్వహిస్తున్న డ్వాక్రా సభ్యులు
- అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్
- ఒక్కో వికాస కేంద్రానికి రూ.15 లక్షల ఆర్థిక సాయం
- రూ.14.70 కోట్ల వ్యయం



జి.మాడుగుల మండలంలో మహిళలు తయారు చేసిన విస్తరాకులు



పాడేరులోని వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్



అనంతగిరి ఘాట్‌లో ఉత్పత్తులను విక్రయిస్తున్న గిరిజన మహిళ

సాక్షి, పాడేరు: అటవీ ప్రాంతంలో సేకరించి తెచ్చే ఫలసాయానికి అదనపు విలువలు జోడించి మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా వన్‌ధన్ వికాస కేంద్రాల(వీడీవీకే)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆదివాసీ మహిళల స్వయం సమృద్ధే లక్ష్యంగా పాడేరు డివిజన్‌లోని పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో ఐటీడీఏ, వెలుగు ఆధ్వర్యంలో 98 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తులు, చిరుధాన్యాలు, అటవీ ప్రాంతాల్లో సేకరిస్తున్న ఫలసాయాలను ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌కు తరలించేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను డ్వాక్రా సంఘాలకు చెందిన ఆదివాసీ మహిళలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా ఐటీడీఏ, వెలుగు శాఖల ఆధ్వర్యంలో ఆ సంఘాలకు రుణాలు అందిస్తోంది. ఒక్కో వన్‌ధన్ వికాస కేంద్రానికి రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. యంత్రాల కొనుగోలుకు రూ.10 లక్షలు, శిక్షణ కోసం రూ.5 లక్షలు ఖర్చు పెట్టారు. మొత్తం రూ.14.70 కోట్లు వ్యయం చేశారు. 2019లో 54 కేంద్రాలు, 2020లో 16 కేంద్రాలు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 28 వన్‌ధన్ వికాస కేంద్రాలను ఐటీడీఏ ప్రారంభించింది. ప్రతి వన్‌ధన్ వికాస కేంద్రంలో ఆయా గ్రామాల పరిధిలో 15 డ్వాక్రా సంఘాలకు చెందిన 300 మంది ఆదివాసీ మహిళలను భాగస్వామ్యం చేశారు. వారందరికీ స్వయం ఉపాధి కల్పన, మెరుగైన జీవనోపాధి, ఆదాయాన్ని అందించడం లక్ష్యంగాకేంద్రాలు పనిచేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వన్‌ధన్ వికాస కేంద్రాలకు వెలుగు శాఖ బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తోంది. ఆ సొమ్ముతో వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి, శుభ్రపరిచి(ప్రాసెసింగ్) మార్కెటింగ్ జరుపుతున్నారు. వచ్చిన లాభాలను ఆయా వన్‌ధన్ వికాస కేంద్రంలోని మహిళలు పంచుకుని స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. బకాయిలను బ్యాంకులకు సకాలంలో చెల్లిస్తున్నారు.

ఆదివాసీ మహిళల ఉత్పత్తులు ఇవే..

పాడేరు డివిజన్‌లోని 98 వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా ఆదివాసీ మహిళలు పలు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తున్నారు. వాటికి విలువలు పెంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తోంది. మిషన్‌పై అడ్డాకులను కుట్టి అందంగా తయారు చేస్తున్నారు. చింతపండుకు పిక్క,నార తీసి కేకులు తయారు చేస్తున్నారు, కొండచీపుళ్ల తయారీ, పసుపు పొడి, చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, రాగుల కొనుగోలు, యంత్రాలతో మిల్లింగ్, చిరుధాన్యాలతో బిస్కట్ల తయారీ, కాఫీ గింజలతో పౌడర్ తయారీ, రాజ్‌మా ఎరుపు, తెలుపు గింజలను స్థానిక గిరిజనుల వద్ద కొనుగోలు చేసి ప్యాకింగ్, మార్కెటింగ్ చేస్తున్నారు.

సంవత్సరం	కేంద్రాలు
2019	54
2020	16
2021	28

మార్కెటింగ్ బ్రాండ్లు..

పాడేరు మన్యం మిల్లెట్ బిస్కట్స్, పాడేరు మన్యం బ్లాక్ పెప్పర్, టర్మరిక్ పౌడర్, రాజ్‌మా రెడ్, వైట్, అడ్డాకులు, రాగి పిండి, పాడేరు మన్యం ఫాక్స్‌టైల్ మిల్లెట్స్, పాడేరు మన్యం లిటిల్ మిల్లెట్స్, అరకు కాఫీ పౌడర్ పేరిట ప్యాకింగ్‌లతో మార్కెటింగ్ జరుపుతున్నారు.


అమ్మకాల జోరు

ఆర్గానిక్ వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తులు, అటవీ ఫలసాయం మార్కెటింగ్ జోరుగా సాగుతోంది. ఆర్గానిక్‌ఉత్పత్తుల వినియోగానికి అలవాటు పడిన ప్రజలు, పర్యాటకులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజన మహిళలు ప్యాకింగ్ చేస్తున్న ఉత్పత్తులన్నింటికీ వెలుగుశాఖ మార్కెటింగ్ చేస్తోంది. పాడేరులో వెలుగుశాఖ ఇటీవల మార్ట్‌ను ప్రారంభించింది. అన్ని పర్యాటక ప్రాంతాలతోపాటు విశాఖపట్నంలోని పలు సూపర్‌బజార్లు, డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, వారపుసంతల్లోనూ అమ్మకాలు జరుపుతున్నారు. ప్రత్యేక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనూ ప్రజలకు ఈ గిరిజనుల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చారు.

66 కేంద్రాల్లో అమ్మకాల వివరాలు

ఉత్పత్తి	వీడీవీకేలు	సేల్స్	నగదు
చింతపండు	21	8,130 కిలోలు	2,16,500
అడ్డాకులు	20	5,872 ఆకులు	80,560
కొండచీపుళ్లు	06	3,180 కట్టలు	1,07,300
పసుపు	01	950 కిలోలు	1,71,000
సామలు	02	310 కిలోలు	40,300
కొర్రలు	01	615 కిలోలు	36,900
రాగులు	01	2,150 కిలోలు	64,500
మిల్లెట్ బిస్కట్లు	01	8,252	59,750
కాఫీ	01	05 కిలోలు	2,250
రాజ్‌మా తెలుపు	01	1,250 కిలోలు	1,39,200
రాజ్‌మా ఎరుపు	01	1,814 కిలోలు	90,000
చోడిపిండి	02	2,350కిలోలు	94,000
నల్లమిరియాలు	06	290 కిలోలు	59,750
బ్లాక్‌రైస్	01	50 కిలోలు	5000
లక్కబొమ్మలు	02	900	9,000

కాఫీ పౌడర్ వ్యాపారం బాగుంది



వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా నాణ్యమైన కాఫీ పౌడర్ తయారీలో శిక్షణ పొందాం. రూ.10 లక్షలతో కాఫీ పౌడర్ తయారీ చేసే యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. రెండేళ్ల నుంచి 300 మంది వరకు డ్వాక్రా మహిళలమంతా అరకు కాఫీ పౌడర్ పేరుతో అమ్మకాలు జరుపుతున్నాం. మంచి లాభాలు వస్తుండటంతో వ్యాపారం ద్వారా జీవనోపాధి పొందుతున్నాం.

– ఎం.శాంతి, కాఫీ ఉత్పత్తి విభాగం, కొండిభ వన్‌ధన్ వికాస కేంద్రం, అనంతగిరి మండలం

విజయవంతంగా వన్‌ధన్ కేంద్రాలు



పాడేరు డివిజన్‌లోని 98 వన్‌ధన్ వికాస కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నాయి. డ్వాక్రా మహిళలకు సీజనల్ వారీగా రుణాలు మంజూరు చేస్తున్నాం. వాటితో వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను తోటి గిరిజనుల వద్ద గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నారు. వాటి నాణ్యత, విలువలను పెంచిన తరువాత మార్కెటింగ్ జరుపుతున్నారు. వెలుగు శాఖ అన్ని విధాలా వారికి సహకరిస్తోంది.ఆయా ఉత్పత్తుల ద్వారా గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామికి ఆహ్వానం



స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామికి ఆలయ వార్షికోత్సవాల గురించి వివరిస్తున్న లకే చిట్టిబాబు,ఇతర ప్రతినిధులు

సాక్షి,పాడేరు: విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిని హుకుంపేట మండలం ఉక్కుర్బ గ్రా మంలోని స్వయంభూవు భీమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లకే చిట్టిబాబు గురువారం కలిశారు. వచ్చేనెల 8,9,10తేదీల్లో జరిగే భీమలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొవలసిందిగా ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వాన పత్రం అందజేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం



యువకుడికి వైద్య సేవలందిస్తున్న, వైద్యాధికారి చైతన్య

వై.రామవరం: కొయ్యూరు మండలం యు. చీడిపాలెం పంచాయతీ పి.గంగవరం గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మణ్(28) గురువారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో సమస్యలతో మనస్తాపం చెంది ఈ దారుణానికి యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని వెంటనే 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా, వైద్యాధికారి చైతన్య వైద్య సేవలందిస్తున్నారు. ఎక్కువ మోతాదులో మందు తాగాడని, 24 గంటల తర్వాత అతడి ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పగలమని ఆయన తెలిపారు.

కేజీబీవీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- బొడ్డేరు గెడ్డలో బాలిక మృతదేహం
- బాధిత కుటుంబానికి డీఈవో వెంకటలక్ష్మమ్మ పరామర్శ



విద్యార్థిని కుటుంబాన్ని ఓదారుస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ





బొడ్డేరు గెడ్డలో బాలిక మృతదేహం (ఇన్‌సెట్) చిన్నారి(ఫైల్)

నర్సీపట్నం/గొలుగొండ: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థిని కనిపించకుండా పోయింది. ఒక పక్క కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గొలుగొండ మండలం చోద్యం సమీపన బొడ్డేరు గెడ్డలో శవమై తేలింది. గురువారం వెలుగు చూసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డి.కొత్తూరుకు చెందిన తుర్రె వీరబాబు కుమార్తె చిన్న అలియాస్ చిన్నారి (14) రోలుగుంట మండలంలో చిన్నాన్న వద్ద పెరుగుతోంది. అనకాపల్లి జిల్లా రోలుగుంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుకుంటోంది. ఈ నెల 27న కేజీబీవీలో ఉపాధ్యాయినులకు చెప్పకుండా తండ్రి వీరబాబు వద్దకు వచ్చేసింది. 28న స్కూల్‌కని చెప్పి తన ఇంటి నుంచి బయలుదేరింది. ఆ రోజు విద్యార్థిని ఇంకా రాలేదని ఆమె చిన్నాన్నకు ప్రత్యేకాధికారి సమాచారమిచ్చారు. దీంతో కంగారు పడిన విద్యార్థిని కుటుంబీకులు ఆమె కోసం వెతకడం మొదలుపెట్టారు. ఇంతలో చోద్యం గ్రామ సమీపాన బొడ్డేరు గెడ్డలో విద్యార్థిని విగతజీవిగా కనిపించింది. స్థానికులు గుర్తించి పరిసర ప్రాంతాలకు సమాచారం అందించారు. ఈ క్రమంలో విద్యార్థిని మేనమామ మరువాడ అర్జున్ అక్కడికి చేరుకుని మృతదేహం తన మేనకోడలిగా గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, కృష్ణదేవిపేట ఇన్‌చార్జి ఎస్‌ఐ నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాధిత కుటుంబాన్ని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం పరామర్శించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని మేనమామ అర్జున్ కోరాడు. గొలుగొండ ఎస్‌ఐ నారాయణరావు మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. విద్యార్థిని మృతిపై చాలా కోణాల్లో అనుమానాలు ఉన్నందున లోతుగా విచారణ చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

విద్యార్థిని మృతిపై కేజీబీవీలో డీఈవో విచారణ

రోలుగుంట: స్థానిక కేజీబీవీ విద్యార్థిని తుర్రె చిన్నారి మృతి చెందడంపై డీఈవో, జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు గురువారం విచారణ చేశారు. ఎంఈవో సాయి శైలజ, ఎస్‌వో తులసి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 27న ఆ బాలిక గైర్హాజరైనట్టు హాజరు పట్టీ పరిశీలించి తెలుసుకున్నామని, వెంటనే రోలుగుంట మండలం అడ్డసరంలో బాలిక చిన్నాన్న తుర్రె కల్యాణం, పిన్ని నూకాలమ్మ ఇంటికి వెళ్లి విచారించామని సిబ్బంది, ఎస్‌వో తెలిపారు. ఆ బాలిక తండ్రి వీరబాబుకు ఫోన్ చేయగా, వీడియో కాల్‌లో మాట్లాడించినట్టు డీఈవోకు వివరించారు. 28వ తేదీ ఉదయమే పంపించేస్తామని రాతపూర్వకంగా ఇచ్చారని, 28, 29 తేదీల్లో ఆ బాలిక రాలేదన్నారు. తండ్రి వీరబాబుకు ఫోన్ చేసినా కలవలేదని, చిన్నాన్నకు సమాచారమిచ్చామన్నారు. ఇంతలో చోద్యం సమీపాన చెరువులో చిన్నారి మృతదేహం లభ్యమైనట్టు తెలిసిందని వివరించారు.

సమగ్ర విచారణ చేయాలి

కొయ్యూరు: ఆడాకుల పంచాయతీ దూసరి కొత్తూరుకు చెందిన విద్యార్థిని చిన్నారి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సూరిబాబు డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం బొడ్డేరు గెడ్డలో ఆమె మృతదేహం లభ్యం కావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. రోలుగుంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక లింగేపటలో తీర్థాలు చూసేందుకు కొద్ది రోజుల కిందట వచ్చి పాఠశాలకు వెళ్తున్నట్టుగా చెప్పిందన్నారు. దీనిపై పోలీసులు విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

నేడు మన్యం బంద్

సాక్షి, పాడేరు: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీతో పాటు పలు గిరిజన సంఘాలు శుక్రవారం మన్యం బంద్ పాటించాలని పిలుపునిచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం అరకులోయలో గిరిజన సంఘం నేతలు బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. ఇంటర్ పరీక్షలతో పాటు 104, 108, ఇతర అంబులెన్స్‌లతో పాటు, పలు అత్యవసర సర్వీసులకు బంద్ నుంచి మినహాయింపు ఇస్తున్నామని ఆదివాసీ జేఏసీ నేతలు, మావోయిస్టులు ప్రకటించారు.

బంద్‌కు ప్రభుత్వ అనుమతి లేదు: ఎస్పీ సతీష్‌కుమార్

మన్యం బంద్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ, ప్రైవేట్ రవాణా వ్యవస్థతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు పనిచేస్తాయన్నారు. బంద్‌తో ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటామని, అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్‌లలో భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.

యథావిధిగా పాఠశాలలు తెరవాలి: డీఈవో సలీమ్ బాషా

జిల్లాలోని ప్రభుత్వానికి చెందిన అన్ని యాజమాన్య పాఠశాలలను శుక్రవారం యథావిధిగా తెరవాలని డీఈవో సలీమ్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలను తెరవడంతో పాటు, పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట పనివారంతా పాఠశాలలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు

ఆర్టీసీ పలు బస్సు సర్వీసులను శుక్రవారం రద్దు చేసింది. విశాఖ,నర్సీపట్నం,ఎస్.కోట డిపోల నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు నడిచే సర్వీసులను నిలిపివేయనున్నారు. పాడేరు డిపోకు సంబంధించి అరకులోయ,ముంచంగిపుట్టు,చింతపల్లి రూట్‌లలోని పలు నైట్‌హాల్ట్ సర్వీసులను వెనక్కి రప్పించారు. డొంకరాయి ఎక్స్‌ప్రెస్ సర్వీసును సీలేరు పోలీసు స్టేషన్‌లోను, కొయ్యూరు మండలం మంప బస్సును కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో నిలిపివేస్తున్నట్టు డిపో మేనేజర్ సీతారామ్‌నాయుడు తెలిపారు. రంపచోడవరం బస్సును పూర్తిగా రద్దు చేశామన్నారు. రాజమండ్రి, కాకినాడ డిపోలకు చెందిన పలు బస్ సర్వీసులను పరిస్థితిని బట్టి మారేడుమిల్లి,చింతూరు,భద్రాచలం ప్రాంతాలకు నడుపుతామని,వీలుకాని పక్షంలో రద్దు చేస్తామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.అరకులోయ మీదుగా ఒడిశాలోని ఒనకఢిల్లీ,జైపూర్ అంతరాష్ట్ర సర్వీసులను కూడా రద్దు చేశారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు



విశాఖపట్నం స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్న రైలు

తాటిచెట్లపాలెం: పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు వద్ద గురువారం తెల్లవారుజామున దురంతో ఎక్స్‌ప్రెస్ బొలెరో వాహనాన్ని ఢీ కొంది. ఈ కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రెండు నుంచి మూడున్నర గంటల ఆలస్యంగా విశాఖపట్నం చేరుకున్నాయి. దురంతో ఎక్స్‌ప్రెస్ లోకో మరమ్మతులు గురికావడంతో.. మరో లోకోను ఏర్పాటుచేసి విశాఖపట్నం తీసుకొచ్చారు. గురువారం ఉదయం 6.25 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సిన ఈ రైలు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంది. అలాగే నాందేడ్–విశాఖపట్నం (20812) మూడు గంటలు, తిరుపతి–విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ రెండున్నర గంటలు, బెంగళూరు–భువనేశ్వర్(18464) మూడు గంటలు, పుదుచ్చేరి–భువనేశ్వర్(12897) మూడు గంటలు, కడప–విశాఖపట్నం(17487) రెండున్నర గంటలు, మహబూబ్‌నగర్–విశాఖపట్నం(08586) ఐదున్నర గంటలు, గుంటూరు–రాయగడ (17243) నాలుగు గంటలు, విజయవాడ–విశాఖపట్నం (12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచాయి.

పలు రైళ్ల రీషెడ్యూల్

- రాయగడ–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా రాయగడలో 4.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖపట్నం – కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ 1.25 గంటలు ఆలస్యంగా విశాఖపట్నంలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరింది.

ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నం

అల్లిపురం: ఆటోడ్రైవర్‌పై ఓ కాబ్లర్ కత్తితో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ఓ జ్యూయలర్ షాపు వద్ద సీతంపేట ప్రాంతానికి చెందిన పి.వెంకటరమణ చెప్పులు కుడుతుంటాడు. అతని దుకాణం ఎదురుగా గాజువాకకు చెందిన ఆటోడ్రైవర్ ఆర్.శ్రీనివాస్ ఆటో అడ్డంగా నిలిపాడు. ఆటోను పక్కకి తియ్యమన్న వినలేదని కొబ్బరి బొండాల కత్తితో ఆటోడ్రైవర్ తలపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

పేదలకు గృహోపకరణాలు పంపిణీ

సీఆర్‌పీఎఫ్ డీ–42 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం



గ్రామస్తులకు భోజనం అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది



గ్రామస్తులకు పరికరాలు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

వై.రామవరం: మండల కేంద్రంలోని సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో బెటాలియన్ కమాండెంట్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సురేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసులతో సత్సంబంధాలు కలిగి ఉండడానికే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాం ద్వారా సీఆర్‌పీఎఫ్ పోలీసుశాఖ గిరిజన ప్రాంత అభివృద్ధిలో పాలు పంచుకుంటుందన్నారు. బెటాలియన్ ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పేద గిరిజనులకు సేవలందిస్తున్నామన్నారు.

ఇందులో భాగంగా వై.రామవరం మండలంలో గతంలో బస్‌షెల్టర్‌లు , లోతట్టు గ్రామాల్లో తాగునీటి పథకాలు నిర్మించామన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. మావోయిస్టు బాధిత కుటుంబాలకు, వితంతువులకు కుట్టు మిషన్లు అందించామన్నారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశామన్నారు. పేదలకు దుప్పట్లు, రగ్గులు, గృహ ఉపకరణాలు, వ్యవసాయ పనిముట్లు, దుస్తులు, సోలార్ లైట్లు అందజేశామన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, విద్యార్థినులకు సైకిళ్లు, పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది పేద గిరిజనులకు వాటర్ డ్రమ్‌లు, స్టీల్ సామగ్రి, దుప్పట్లు, రేడియోలు, సోలార్ లైట్లు, వ్యవసాయ పనిముట్లు తదితర సామగ్రితో పాటు అనేక రకాల కాయగూర విత్తనాలు అందజేశారు.

చిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు వల్లాల బాలురెడ్డి, వల్లాల రాజేశ్వరి, నాయకులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. అలాగే స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంటు గౌతమి, ఎస్‌బీఐ మేనేజర్ యు.నాగరాజు, హెడ్ క్యాషియర్ దీపక్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్‌ఐ రాంబాబులు సహాయ సహకారాలు అందించారు. స్టేషన్ సిబ్బంది, సిఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ సిబ్బంది, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సివిక్‌యాక్షన్

చింతూరు: సీఆర్పీఎఫ్ ఈ–42 బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సివిక్‌యాక్షన్ కా ర్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమాండెంట్ షెకావత్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు వ్యవసాయ పనిముట్లు, డ్రమ్ములు, వంట సామగ్రి, రేడియోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, సీఐ అప్పలనాయుడు, డాక్టర్ నితిన్ జెల్లీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 35వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శి నవర మోదకొండబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బ్యాటింగ్ చేయగా రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు బౌలింగ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు అందించడం వల్ల గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, ఉత్సవ కమిటీ ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు, నిర్వాహకులు కొంటా దుర్గారావు, తాంగుల మహేష్, అగతంబిడి రాజారావు నరేష్, సతీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధురాలి మృతి

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురంలో గురువారం ఆర్టీసీ బస్సు కిందపడి అదే గ్రామానికి చెందిన బోర రాఘవమ్మ(82) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం... బోరా రాఘవమ్మ ఏలేశ్వరం వారపు సంతకు వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరి తిమ్మాపురం కూడలికి వచ్చింది. అదే సమయంలో ఏలేశ్వరం నుంచి వై.రామవరం వైపు వెళ్లే బస్సు అక్కడ ఆగింది. ఈ లోగా ఆమె ఆ బస్సు ముందువైపు నుంచి రోడ్డు దాటుతుండగా, అది గమనించని డ్రైవర్ ముందుకు పోనిచ్చాడు. దీంతో బస్సు ఆమెపై నుంచి వెళ్లిపోయింది. తల భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఇతర శరీర భాగాల వద్ద తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ అప్పలరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు.

మేకప్ ఆర్టిస్ట్‌పై దాడి

సీతమ్మధార: మేకప్ ఆర్టిస్ట్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి నగదు లాక్కొని పరారయ్యారు. అక్కయ్యపాలెంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలివీ..అక్కయ్యపాలేనికి చెందిన అప్పలకొండ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే పాయింట్ సెలూన్ దుకాణం నడుపుతున్నాడు. సినిమా తారలకు మేకప్ చేస్తుంటాడు. బుధవారం షూటింగ్‌కు వెళ్లి.. రాత్రి షాపు వద్దకు వచ్చాడు. దుకాణంలో నగదు తీసుకుని అక్కయ్యపాలెం వివేకానంద ఆస్పత్రి పక్క రోడ్డులో నడుచుకుని ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో అటుగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి లిఫ్ట్ కావాలా అని అడిగారు. కొంచెం ముందు దించేయాలని అప్పలకొండ వారి ద్విచక్రవాహనం ఎక్కాడు. కొద్ది దూరం తీసుకువెళ్లి అతన్ని బెదిరించారు. అతని జేబులో ఉన్న రూ.6వేల నగదును బలవంతంగా లాక్కొని దాడి చేసి పరారయ్యారు. ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు ఫిర్యాదు చేశాడు. క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.